



ప్రసాదరాయ కులపతి
PRINCIPAL
HINDU COLLEGE

శ్రీనాథపీఠము - గుంటూరు

ఆర్థిక, చారిత్రక, భాషా, శాస్త్రవేత్త వ్యాకరణ పతంజలి

ఆచార్య డాక్టర్ కోరాడ మహాదేవశాస్త్రి

మహోదయులకు

మహాకవి - మంత్రశాస్త్ర కళానిధి డా॥ ప్రసాదరాయకులపతి సాహితీ పురస్కార ప్రదాన సందర్భంగా

అభినందన చందనము

శ్రీమహాదేవశాస్త్రి బుధేంద్రా! ప్రతి భాసాంద్రా!

ఉమ్మడి మదరాసు రాష్ట్రంలో మదరాసు విశ్వవిద్యాలయంలో తెలుగు శాఖాధ్యక్షులుగా షుమారు రెండు దశాబ్దాల కాలం పనిచేసిన శ్రీ కోరాడ రామకృష్ణయ్య శ్రీమతి అన్నపూర్ణమ్మల గర్భశుక్తి ముక్తాఫలమై జన్మించిన మీరు ఆర్థిక, చరిత్ర విభాగాలలో పరమపట్టభద్రులైన సిమ్లాలోని లేబర్ డిపార్ట్‌మెంటులోనూ, ఢిల్లీలోని ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ మరియు ఇండస్ట్రీస్ డిపార్ట్‌మెంటులోనూ పరిశోధకునిగా చేసిన మీ మేధాసంపత్తికి మా నమోవాకాలు.

స్వర్ణ పతక పురస్కార గ్రహీతా! వినయవినీతా!

విస్తృతమైన విద్యాతృష్ణతో కలకత్తాలోని విశ్వవిద్యాలయం నుండి భాషాశాస్త్రంపై తులనాత్మక పరిశీలనతో పరమపట్టభద్రులై, భాషాశాస్త్రము - మానవ ఆచారాలు విశ్వాసాల పరిణామ చరిత్ర పై శిక్షణ పొందిన విశేష ప్రతిభాపాటవాలకు మా శతానేక వందనాలు ఆనందనందనాలు. తెలుగు వ్యాకరణ చరిత్రపై మీరు సమర్పించిన పరిశోధన గ్రంథం డాక్టర్ ఆఫ్ లిటరేచర్ డిగ్రీని సంపాదించి పెట్టి అక్షర నీరాజనం పుట్టింది.

ఆచార్యాదర్శా! శిష్యహృదయస్పర్శా!

అన్నామలై విశ్వవిద్యాలయంలో భాషాశాస్త్ర విభాగంలో ఆచార్యులుగా ప్రవేశించిన మీరు తిరుపతి శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోనూ, అనంతపురం శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోనూ రెండు పుష్కరాల కాలం ఆచార్యులుగా, ఆంధ్రశాఖాధ్యక్షులుగా విరాజిల్లటమే గాక శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ప్రాచార్యునిగా కూడా మీ సేవలందించారు. శిష్యుల హృదయాలలో చిరస్థాయిగా నిలచారు. జర్మనీ కొలోన్ యూనివర్సిటిలో ఇండాలజీ విభాగంలో విజిటింగ్ ప్రొఫెసర్‌గా చేసి తెలుగుభాషకు, తెలుగుదేశానికి కీర్తిప్రతిష్ఠలు ఆర్జించి పెట్టారు.

మీరు వ్రాసిన తెలుగు వ్యాకరణ చరిత్రను శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం వారు, డిస్క్రిప్టివ్ గ్రామర్ అండ్ హాండ్ బుక్ ఆఫ్ మోడరన్ తెలుగును జర్మనీలోని ఫ్రాంర్ఘ స్టైనర్‌వెర్లగ్, విస్‌బాడెన్ వారు ప్రచురించి తెలుగుభాషకు ఎంతో మేలు చేశారు. మీరు వివిధ విశ్వవిద్యాలయాలలో భాషాశాస్త్రంపై చేసిన ప్రసంగ వ్యాసాలు మేల్తరమై నేటికి చాలామంధికి మార్గదర్శనం చేస్తున్నారు.

ఈ లోకంలో ప్రసాదరాయ కులపతి వంటి శిష్యులను తయారు చేసిన మీ వంటి గురుదేవులను చూచి ఆంధ్రదేశం గర్విస్తున్నది. మీకు, మీ కుటుంబానికి భగవంతుడు ఆయురారోగ్య భాగ్యాలు ప్రసాదించాలని ప్రార్థిస్తున్నాము.

రచన : "పురుషోత్తమ పుర్తభార్గవ" పి.యస్.ఆర్. ఆంజనేయప్రసాద్

గుంటూరు

6-1-2011

సమర్పణ

శ్రీనాథపీఠము